క్లుప్తంగా

ఫ్లెక్సీలను తొలగించారు..



ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద తొలగించిన ఫ్లెక్సీలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ పద మూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఉన్న కూటమి నాయకులకు చెందిన ఫ్లెక్సీలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి ప్రకారం నగరంలో అన్నిచోట్ల అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడం, ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టారు. పదమూడో వార్డులో మాత్రం అధికారులు కోడ్ నియమ, నిబంధనలకు నీళ్లొదిలారు. దీనిపై సోమవారం కోడ్ విగ్రహాలకేనా.. ఫ్లెక్సీలకు లేదా? అనే శీర్షికతో సాక్షిలో వెలువడిన కథనానికి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. ఉదయం 9 గంటలకు ఆగమేఘాలపై సిబ్బందిని పంపించి, కాలనీలో కూటమి నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ రికార్డులు, ఓపీ, ఐపీ, ఈహెచ్‌ఆర్, డయగ్నస్టిక్ సేవలు, మందుల లభ్యత, ముఖ్యంగా ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే తదితర అంశాలపై ఆరా తీశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవల గురించి వైద్య సిబ్బందికి విశదీకరించారు. ప్రతి ఒక్కరూ ముఖహాజరు విధిగా వేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమావతి, యూపీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

బీచ్‌రోడ్డు: గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన దాడులో 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రామాటాకీస్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు అక్రమ గంజాయి తరలిస్తున్నట్లు నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో రామాటాకీస్‌కు చేరుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టగా ఇద్దరు వ్యక్తుల వద్ద 10 కేజీల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

పోర్టు కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు



సత్కార సభలో అతిథులతో జిల్లా ఐఎన్‌టీయూసీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు డీఎల్‌బీ కాలనీ శాంతినగర్‌లో నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు గొర్లె చందు ఆధ్వర్యంలో జాతీయ పోర్టు ఐఎన్‌టీయూసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జాతీయ ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ అధ్యక్షుడు అబుబక్కర్(మంగుళూర్), ప్రధాన కార్యదర్శి రాణా(కాండ్ల పోర్ట్)లను ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు అబుబక్కర్ మాట్లాడుతూ విశాఖ పోర్ట్ కార్మికుల సమస్యలపై చేస్తున్న అన్ని పోరాటాలకు తమ పూర్తి మద్దతు, జాతీయ కార్యవర్గంలోని సభ్యులకు మరింత ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నాగభాష్యం, ఈశ్వరరావు, యూనియన్ నాయకులు గురుప్రసాద్, వెంకటరావు, రమణ, సత్యనారాయణ, అప్పారావు, ఆశిష్, రాజు, తిరుపతిరావు, హేమంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మిథ్యానవనం

- నిరుపయోగంగా రెవెన్యూ పార్కు
- విశాలాక్షినగర్‌లో వినోదం కరవు
- అభివృద్ధికి అడ్డు తగులుతున్న స్థానిక నాయకులు



విరిగిన జారుడుబల్ల



విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో పనిచేయని వాటర్ ఫౌంటైన్

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో రెవెన్యూ పార్కు అధ్వానంగా మారింది. ఒకప్పుడు సాంస్కృతిక కార్యకలాపాలతో కళకళలాడే ఈ పార్కు ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. సాయంత్రం సమయంలో ఆటలాడుకోవడానికి వచ్చే పిల్లలతో సందడిగా ఉండేది. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్ ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. పలు కాలనీల నుంచి వృద్ధులు పార్కులో కాలక్షేపం చేసేవాళ్లు.

తుప్పుపట్టిన ఆటపరికరాలు


పార్కులో ఆటపరికరాలు తుప్పుపట్టాయి. ఇనుప బెంచీలు శిథిలావస్థకు చేరాయి. వాటర్ ఫౌంటైన్ పనిచేయడంలేదు. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే కళావేదిక పైకప్పు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. వేదిక గోడలు పెచ్చులు డిపోయాయి. ఫుట్‌పాత్‌లపై పలకలు ఊడిపోయాయి. పార్కులో కొన్నిచోట్ల పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. చెట్ల ఆకులు, కొమ్మలతో అస్తవ్యస్తంగా మారిపోయింది.

స్థానిక నాయకులు హర్ట్ అయ్యారు

పార్కును పునరుద్ధరించాలని ఇటీవల రెవెన్యూ పార్కు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ముందుగా ఆటపరికరాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ అధికారులు ముందుకు వచ్చారు. కొన్ని ఆట పరికరాలను తీసుకువచ్చి పార్కులో సిద్ధం చేశారు. అయితే అవి సెకండ్ హ్యాండ్ పరికరాలు కావడం విశేషం. ఎక్కడో వినియోగించిన పరికరాలను తీసుకువచ్చి ఇక్కడ ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు. వాటికి కూడా కొందరు స్థానిక టీడీపీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కు సమస్యపై నేరుగా ఎమ్మెల్యేను కలవడంతో స్థానిక నాయకులు హర్ట్ అయ్యారు. దీంతో ఇక్కడ పార్కులో పరికరాలు ఏర్పాటు కాకుండా అధికారులకు అడ్డు తగులుతున్నట్టు విమర్శలున్నాయి.

నమామి శ్రీవాణి.. స్మరామి గీర్వాణి

- భక్తిశ్రద్ధలతో వసంత పంచమి
- చదువుల తల్లికి విద్యార్థుల ప్రత్యేక పూజలు
- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు



ఆరిలోవ ఉషోదయ స్కూల్‌లో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న వేద పండితులు



జీవీకే పాఠశాలలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఏయూ పూర్వ వీసీ నాగేశ్వరరావు

ఆరిలోవ: చదువుల తల్లి సరస్వతీదేవిని భక్తి శ్రద్ధలతో అర్చించారు విద్యార్థులు. వసంతపంచమి పర్వదిన వేళ అమ్మవారి సన్నిధి చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కళకళలాడింది. పాఠశాలల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

- విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఏయూ పూర్వ వీసీ జి.నాగేశ్వరరావు పాల్గొని, పాఠశాల చైర్మన్ వెంకటేశ్వర్లుతో కలసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా 60 మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినట్లు ప్రిన్సిపాల్ మాధురి తెలిపారు.
- టీఐసీ పాయింట్ దరి ఉషోదయ స్కూల్లో శ్రీపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సింహాచలం నుంచి వేదపండితులు హాజరై, విద్యార్థులతో సామూహికంగా హయగ్రీవ పూజలు చేయించారు. సరస్వతీదేవిని భక్తితో ప్రార్థించారు. పూజల్లో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హయగ్రీవ పూజ చేస్తున్న విద్యార్థులు

పనులు చేశారు.. గోతులు వదిలేశారు



చినగదిలి సాయిబాబా ఆలయం పక్కన రోడ్డుపై పెద్ద రంధ్రం



నీటి పైపు మరమ్మతుల కోసం తొలగించి వదిలేసిన గోడ భాగం

- అసంపూర్తి పనులతో స్థానికుల అవస్థలు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ మధ్యలో ప్రధాన రహదారిపై ఏర్పడిన రంధ్రాలు ప్రమాదకరంగా మారాయి. పైప్‌లైన్ మరమ్మతుల కోసం చేసిన రంధ్రం పెద్దది కాగా.. పక్కనే ఏర్పడిన మరో గొయ్యితో ప్రమాదం పొంచి ఉంది. అసంపూర్తి పనులతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

నాలుగు రోజుల క్రితం చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డు పక్కన నీటి సరఫరా పైపు లైన్ లీకైంది. దీంతో జీవీఎంసీకి చెందిన ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది ఆ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ గోడ లోపల ఉన్న పైపులైన్ లీకవడంతో మరమ్మతులు చేయడానికి రోడ్డు పక్కన ఉన్న గోడ భాగంతోపాటు గోడను ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్ భాగం తొలగించారు. నీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టిన తర్వాత దాన్ని వదిలేశారు. దీంతో తొలగించిన గోడ, ఫుట్‌పాత్ భాగం గొయ్యిగా మారాయి. దీంతో ఇక్కడ ఫుట్‌పాత్‌పై నడిచేవారికి ఇబ్బందిగా ఉంది. దీని పక్కనే రోడ్డు మీద ఆదివారం రాత్రి పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇక్కడ మరమ్మతులు చేపట్టిన నీటి పైపునకు మరో పక్క పడిన ఈ గొయ్యి సుమారు నాలుగు అడుగుల లోతులో ఉంది. ఇది పాతాళాన్ని తలపిస్తోంది. ఈ గొయ్యి అంచులు కూడా కిందకు కుంగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో వాహనాలు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఆపాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న తోపుడుబండ్ల కార్మికులు

సీతమ్మధార: సిరిపురం పటేల్ జంక్షన్ తోపుడు బండ్ల కార్మికులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. మద్దిలపాలెం జోన్ తోపుడుబండ్లు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తోపుడు బండ్లపై దాడులు పెరిగాయన్నారు. ఓ వైపు జీవీఎంసీ అధికారులు చిల్లర వర్తకులను ఇబ్బంది పెడుతుంటే..మరో వైపు ట్రాఫిక్ పోలీసులు దాడులు చేస్తున్నారన్నారు. గత మూడు నెలల నుంచి 22వ వార్డు పిఠాపురం కాలనీ సంత జరగనీయకుండా ఆపడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పిఠాపురం కాలనీ సోమవారం సంత కొనసాగించాలని జిల్లా కోర్టు స్టేటస్కో ఇచ్చిందని గుర్తు చేశారు. తోపుడు బండ్లు చిల్లర వర్తక కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడారు. ధర్నాలో చందు, గుప్త, శ్రీనివాసరావు, సిరిపురం జంక్షన్ తోపుడుబండ్ల కార్మికుల అధ్యక్ష కార్యదర్శులు దుర్గారావు, దశరథ్ జన, జి.కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం



నిధుల విడుదలలో వ్యత్యాసాన్ని తెలిపే లేఖను చూపుతున్న జేవీ ప్రభాకర్, తదితరులు

సీతంపేట: జనాభాలో 18 శాతం ఉన్న దళితులకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన దళితులకు బడ్జెట్‌లో రూ.81 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.46 వేల కోట్లు కేటాయించారన్నారు. ఎస్సీ కమిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.71 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.41 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి గత బడ్జెట్‌తో పోల్చితే రూ.50 కోట్లు కోత విధించారన్నారు. గత బడ్జెట్‌తో పోల్చుతూ దళితులకు కేటాయింపుల్లో ఉన్న వ్యత్యాసాన్ని వివరించే లేఖ విడుదల చేశారు. కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపు జరగలేదన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జి.రాంబాబు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థల్లో ప్రైవేటు పెట్టుబడులకు 100 శాతం అవకాశం కల్పించడం అంటే దళితులకు ఇన్సూరెన్స్ కంపెనీలో రిజర్వేషన్లు లేనట్టే అన్నారు. సమావేశంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్బన్న, దళిత నాయకులు ఎస్.రాజులు, ఆర్.సత్యవతి పాల్గొన్నారు.

వారి సాహితీ కృషి అనిర్వచనీయం



జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ కేంద్రీయ హిందీ సంస్థాన్, కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో 'తెలుగు జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతల సాహితీ కృషి'పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ఆచార్య వి. బాలమోహనదాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, గౌరవ అతిథి ఆగ్రా సెంట్రల్ హిందీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య సునీల్ కులకర్ణి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహనదాస్ తెలుగు కవిత్రయమైన విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ చేసిన సాహితీ కృషికి ఫలితంగా అత్యుత్తమ జ్ఞానపీఠ్ పురస్కారాలు వరించాయన్నారు. తెలుగు సాహితీ ఔన్నత్యాన్ని హిందీ వారికి అందించే ప్రయత్నంగా కేంద్రీయ హిందీ సంస్థాన్ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో-ఆర్డినేటర్ ద్వితీయ భాషావిభాగాధ్యక్షుడు డాక్టర్ పీకే జయలక్ష్మి పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ జయలక్ష్మి రచించిన అభినందన గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య గంగాధర్ వనోడే, ఆర్.సుమలత, ఆచార్య జ్యోతి, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్ దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర సుధ, తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో కాకుల మృత్యువాత

- పరిశీలించిన పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు



పార్కులో మృతి చెందిన కాకిని పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌ఏడీడీఎల్ వైద్యులు



ముడసర్లోవ పార్కులో మృతి చెందిన కాకి

అనారోగ్యం కారణంగా కదలలేని స్థితిలో కాకి

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం ముడసర్లోవ పార్కులో కొద్ది రోజులుగా కాకులు, కొంగలు మృత్యువాత పడుతున్నాయి. పదులు సంఖ్యలో ఇవి మరణించడంతో పార్కు నిర్వహణ బాధ్యత చూస్తున్న జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ అధికారులు సోమవారం పార్కును సందర్శించి, కాకులను పరిశీలించారు.

పార్కులో నిత్యం కాకులు, కొంగలు, రామచిలుకలు, వివిధ రకాల పక్షులు వందల సంఖ్యలో చెట్లపై స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. పక్షుల కిలకిలరావాలతో చెట్లపై నుంచి ఎగురుతూ సందర్శకులను అలరిస్తుంటాయి. వీటితో పాటు సాయంత్రం సమయంలో బయట ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పక్షులు గుంపులుగా వచ్చి ఈ పార్కులో చెట్లపైకి చేరుకుంటాయి. అలా వచ్చిన పక్షులు తిరిగి తెల్లవారేసరికి ఎగిరి పోతుంటాయి. ఇదిలా ఉండగా వారం రోజులుగా ఇక్కడ కాకులు, కొంగలు మృత్యువాత పడుతున్నాయి. ఇంతవరకు సుమారు 30కి పైగా మృతి చెందినట్లు పార్కులో నిర్వాహకులు అంటున్నారు. వాటిలో 25 వరకు కాకులు ఉన్నట్లు తెలిపారు. దీనిపై సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

వెటర్నరీ వైద్యుల పరిశీలన

పక్షులు మృతి చెందుతున్న విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ చినగదిలి మండలం ఏడీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, రీజనల్ యానిమల్ డిసీజ్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీ వైద్యులు డాక్టర్ హిమజ, డాక్టర్ అనూష, సిబ్బందితో కలసి ముడసర్లోవ పార్కును సోమవారం సందర్శించారు. ఇక్కడ అనారోగ్యానికి గురై కదలలేని పరిస్థితిలో ఉన్న రెండు కాకులను పరిశీలించి, తోటగరువులో పశు వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు. మృతి చెందిన మరో రెండు కాకులకు పశు వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం వాటి శరీర భాగాలను రీజనల్ యానిమల్ డిసీజ్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌కు పంపించారు.

నివేదిక ఆధారంగా చర్యలు

కాకులకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వాటి శరీర భాగాలను ల్యాబొరేటరీకి పంపించాం. అక్కడ పరీక్షల అనంతరం కాకుల మరణానికి కారణం తెలుస్తుంది. పార్కులో సందర్శకులు తినగా బయట పారబోసిన ఆహారం ఒకటి, రెండు రోజుల వరకు తినే పక్షులు సాధారణంగా కొన్ని మృతి చెందుతుంటాయి. ఎక్కువగా పార్కుల్లో ఇలా జరుగుతుంది. ల్యాబ్ నుంచి రిపోర్టు వస్తే వీటి మృతికి సంబంధించి పూర్తి విషయం తెలుస్తుంది. ఆ నివేదిక ఆధారంగా వాటి మృతిని నివారించే చర్యలు చేపట్టవచ్చు.

– డాక్టర్ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

వెంకటరాజునగర్‌లో చోరీ

సీతమ్మధార: దొండపర్తిలోని తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగిన ఘటనపై ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరణం గోపీనాథ్ అనే వ్యక్తి దొండపర్తిలోని వెంకటరాజునగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గత నెల 31న విజయనగరం జిల్లా ఎస్.కోటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ ఉండగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఫోన్ రావడంతో కంగారుగా ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో వెండి కంచం, కుందులు పోయినట్లు గమనించారు. వెంటనే 112 కాల్ చేసి సమాచారం అందించడంతో ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎంసీ విద్యార్థికి పారా అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.ఆధవన్ 7వ ఏపీ స్టేట్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025లో షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం గెలిచాడు. ఈ పోటీలు గుంటూరు జిల్లా మంగళగిరి గత రెండు రోజులుగా నిర్వహించారు. ఆధవన్‌కు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు అభినందనలు తెలిపారు. కాలేజీ నుంచి రూ.5,000 నగదు బహుమతి అందజేశారు. విద్యార్థికి ప్రోత్సాహం అందించిన ఏపీ స్టేట్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ రామస్వామికి ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

కామేశ్వరీదేవిగా సహస్రాక్షి రాజరాజేశ్వరి



వాగ్దేవి హోమంలో పాల్గొన్న చిన్నారులు




అనంత బాబాతో సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, మిత్ర బృందం

సబ్బవరం: మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి 5వ రోజైన సోమవారం కామేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో కామేశ్వరీ సహిత లఘు శ్యామ హోమం నిర్వహించారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకున్నవారికి ఈతిబాధా వినాశనం, ఉన్నత విద్యా ప్రాప్తి, విదేశీ ప్రదాయకం కలుగుతుందని ప్రతీతి. ఉదయం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

అనంతరం సుమారు 40 మంది బాల బాలికలు, అమృత కన్యా గురుకులం పిల్లలతో వాగ్దేవి హోమం జరిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హరిద్వార్ పుణ్యక్షేత్రం అనంతధామ్ నుంచి అనంత బాబా, వారి శిష్యుడు, సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, శిష్య బృందంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం విశాఖ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నుంచి హనుమంతరావు, షణ్ముక శర్మ శిష్యురాళ్లు ప్రదర్శించిన నాట్య నివేదన ఆకట్టుకుంది.

సోదర ప్రేమకు మహోన్నత నిదర్శనం లక్ష్మణుడు

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- కొనసాగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలు



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: సోదర ప్రేమకు లక్ష్మణుడు మహోన్నతమైన ఉదాహరణ అని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అన్నగారి పట్ల తమ్మునికి ఎంత ప్రేమ ఉండాలి అనే విషయం రామలక్ష్మణుల సంభాషణలో మనకు తెలుస్తుందన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణం ప్రవచనాల్లో భాగంగా 10వ రోజు, సోమవారం ఆయన ప్రవచించారు. శ్రీరామాయణంలో సుమిత్ర మాట్లాడిన ప్రతి మాట ఒక మెరుపు అని, త్యాగం విషయంలో లక్ష్మణునికి ఆవిడ చేసిన దిశానిర్దేశం చాలా గొప్పవన్నారు. శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై అరణ్యవాసానికి బయల్దేరడం, తమ వెంట వస్తామన్న ప్రజలను శ్రీరాముడు వారించడం, తమసా నదిని దాటి అరణ్యవాసం ప్రారంభించడం తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.